క్లుప్తంగా

ప్రతీ తండాలో 'సేవాలాల్' వేడుకలు నిర్వహించాలి

శివ్వంపేట(నర్సాపూర్): సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఈ నెల 15న ప్రతీ గిరిజన తండాలో నిర్వహించాలని కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండలాధ్యక్షుడు తిరుపతి రాథోడ్, నాయకుడు ధనావత్ రమేశ్‌నాయక్ అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. 15న తండాల్లో సేవాలాల్ మహారాజ్ వేడుకలు నిర్వహించడంతో పాటు బోగ్ బండార్ చేపట్టి మండల కేంద్రం, నర్సాపూర్ పట్టణంలో నిర్వహించే ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. పార్టీలకు అతీతంగా గిరిజన ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వారు చెప్పారు.

వైభవంగా రామలింగేశ్వర వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

టేక్మాల్(మెదక్): మండల కేంద్రం టేక్మాల్ రామేశ్వర కుచ్చపై వెలసిన రామలింగేశ్వర ఆలయ వార్షికోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా గణపతి పూజ, రామలింగేశ్వరుడికి మహాభిషేకం, రుద్రాభిషేకం, మహా హారతి వంటి ప్రత్యేక పూజలను చేశారు. ఈ సందర్భంగా వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు నాగరాజు స్వామి, సంతోష్ స్వామి తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షులు రమేశ్, నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో రాణించాలి



జీడిపల్లిలో ఎమ్మార్పీఎస్ నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): మాదిగలు అన్ని రంగాల్లో ముందుకొచ్చి రాణించాలని జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు యాదగిరి, మండలాధ్యక్షుడు మురళి అన్నారు. ఆదివారం మండలంలోని జీడిపల్లి, చెట్లగౌరారం గ్రామాల్లో నూతన కమిటీలను నియమించారు. ఈ సందర్భంగా జీడిపల్లి అధ్యక్షుడిగా ఎర్ర నర్సింలు, ఉపాధ్యక్షుడిగా కట్ట భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా నవీన్, సంయుక్త కార్యదర్శిగా దేవి సురేశ్, కోశాధికారిగా కుమార్ తదితరులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ అశోక్, ఉపాధ్యక్షుడు ఎర్ర ప్రవీణ్, బాల్‌నర్సయ్య, బోజయ్య, బాలరాజ్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో స్వచ్ఛభారత్



పరిసరాలను శుభ్రం చేస్తున్న నేచర్ ఐకాన్ యూత్ సభ్యులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కూచారం గ్రామంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో నేచర్ ఐకాన్ యూత్ ఆధ్వర్యంలో 308వ ఆదివారం పరిసరాలను శుభ్రం చేశారు. చెత్తచెదారం, పిచ్చి మొక్కలను తొలగించి డంప్‌యార్డ్‌కు తరలించారు. అనంతరం మొక్కల వద్ద పాదులను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా యూత్‌ను ఎస్‌ఓ గౌతమి, ఉపాధ్యాయులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో జాతర



స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలైన్‌లో భక్తులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి జాతర భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. అందులో భాగంగా ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర కోనేరులో స్నానమాచరించి లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్నారు. కొండపైనున్న స్వామివారిని కాలినడకన వెళ్లి దర్శించుకున్నారు. లక్ష్మీనర్సింహస్వామికి అర్చకులు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈసందర్భంగా ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన వివిధ దుకాణాల సముదాయం వద్ద భక్తుల రద్దీ నెలకొంది. కార్యక్రమంలో ఆలయ ఈఓ శశిధర్‌గుప్తా, ప్రధాన అర్చకుడు ధనుంజయ్ శర్మ, సిబ్బంది నర్సింహారెడ్డి, విద్యాకర్‌చారి, ప్రకాష్, తదితరులు ఉన్నారు.

లీకేజీలతో ఇబ్బందులు

- రాకపోకలకు అవస్థలు
- నీరు కాలుష్యమవుతున్నాయని ప్రజల ఆవేదన
- పట్టించుకోని అధికారులు



నర్సాపూర్‌లోని కూడలి వద్ద పైపులైన్ నుంచి నిరంతరం లీకేజీ..

తాగు నీటి పైప్‌లైన్లు తరచూ లీకేజీ అవుతున్నాయి. దీంతో మరమ్మతులు చేసేందుకు రోడ్డును తవ్విన అధికారులు పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించకుండా వదిలేయడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. లీకేజీలు యథావిధిగా ఉండడంతో తాగు నీరు కలుషితమవుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం నిర్వహణకు ప్రజాధనంతో శుద్ధి చేసిన నీటిని ప్రజలకు సరఫరా చేస్తుంది. చాలా రోజులుగా పైపులకు పడిన రంధ్రాల నుంచి వృథాగా పోతున్న నీటిని అరికట్టేందుకు అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదు.

– నర్సాపూర్:

కూడలిలో రెండు నెలలుగా లీకేజీ

పట్టణంలోని శివాలయం వెనక ఉన్న కూడలిలో సుమారు రెండు నెలల క్రితం పైప్‌లైన్ లీకేజీ ఏర్పడిందని ప్రజలు తెలిపారు. మున్సిపల్ అధికారులకు చెప్పగా ఇటీవల వచ్చి మరమ్మతులు చేయగా, మరో చోట లీకేజీ ఏర్పడిందన్నారు. ప్రస్తుతం పైప్‌లైన్ నుంచి రాత్రింబవళ్లు నీరు లీకవుతూ రోడ్డుపై పారుతున్నాయన్నారు. వాటికి మరమ్మతులు చేసేందుకు కూడలిలో రోడ్డును అడ్డంగా తవ్వి అడ్డంగా ఇనుప పైపు పెట్టారన్నారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్‌బీఐ కూడలి వద్ద అదే పరిస్థితి

జాతీయ రహదారి నుంచి పట్టణంలోకి వచ్చే ఎస్‌బీఐ కూడలి వద్ద సైతం మిషన్ భగీరథ పథకానికి చెందిన ప్రధాన పైపులైన్ నుంచి చాలా రోజులుగా నీరు లీకవుతుంది. సుమారు వారం రోజుల క్రితం రోడ్డు తవ్వి మరమ్మతు పనులు చేయగా, పైప్‌లైన్‌కు మరో చోట లీకేజీ పడి నీరు రోడ్డుపై పారుతోంది. దీంతో మళ్లీ మరమ్మతులు చేయాల్సి రావడంతో రోడ్డును తవ్విన చోట స్టాపర్లు పెట్టారు. రెండో లీకేజీకి మరమ్మతులు చేసేందుకు జాతీయ రహదారి అధికారుల నుంచి మిషన్ భగీరథ శాఖ అధికారులు అనుమతి తీసుకొని వారం రోజులు కావస్తున్నా.. పట్టించుకోవడం లేదు. దీంతో వాహనదారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు.



ఎస్‌బీఐ కూడలి వద్ద ఏర్పాటు చేసిన స్టాపర్లు

నీరు కలుషితం

పట్టణంలో రెండు కూడళ్ల వద్ద పైపులైన్లకు లీకేజీలు పడి నీరు వృథాగా పోతుంది. కాగా లీకేజీలతో తాగు నీరు కలుషితమవుతుంది. ఈ కలుషిత నీరు తాగడంతో అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

తిప్పలు పడుతున్నాం



నీటి పైపులకు రిపేర్ చేసేందుకు చౌరస్తాలో తవ్విన గోతులు పూడ్చకుండా వదిలేశారు. గోతుల వద్ద రోడ్డుపై అడ్డంగా పైపులు పెట్టారు. వాహనాలపై వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. చాలా రోజుల నుంచి నీళ్లు రోడ్డుపై పారుతున్నాయి. రిపేర్ చేసి, గుంతలు పూడ్చి రోడ్డు బాగు చేయాలి.

– వాసు, శివాలయం వీధి

మరమ్మతులు చేయిస్తా



శివాలయం వెనక పైపులైన్‌కు ఏర్పడిన లీకేజీని పరిశీలించా. చాలా రోజుల క్రితం లీకేజీ ఏర్పడిందని, దానికి మరమ్మత్తులు చేయించా. మళ్లీ మరో చోట రెండు రోజుల క్రితం లీకేజీ బయటపడింది. దానికి త్వరలో మరమ్మతు చేయిస్తా.

– రామకృష్ణారావు, మున్సిపల్ కమిషనర్

రిజర్వేషన్ తేల్చాకే ఎన్నికలు నిర్వహించండి



మాట్లాడుతున్న బీసీ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): కాంగ్రెస్ ప్రభుత్వం బీసీల రిజర్వేషన్ తేల్చాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మాజీ ఎంపీపీ హరికృష్ణ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రమణగౌడ్, ఇతర బీసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఎదుల్లాపూర్‌లో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీసీల జనాభా శాతం ఎక్కువగా ఉన్నప్పటికీ సీఎం రేవంత్‌రెడ్డి రిజర్వేషన్లు మాత్రం అందుకు అనుగుణంగా అమలు చేయడం లేదన్నారు. బీసీలకు సంబంధించి 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిన సీఎం మోసం చేస్తున్నాడని వాపోయారు. బీసీల రిజర్వేషన్లపై వెనకడుగు వేసిన కాంగ్రెస్ పార్టీకి జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్పేందుకు బీసీ వర్గాలు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. న్యాయంగా బీసీలకు రావాల్సిన హక్కులపై పార్టీలకు అతీతంగా పోరాడం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు వెంకటేష్, లక్ష్మీనర్సయ్య, వెంకటేశ్, అశోక్, రాజు, ముత్యాలు తదితరులు ఉన్నారు.

స్కాలర్‌షిప్‌కు విద్యార్థులు ఎంపిక



ఎలేందర్



శ్రీనిత్య



నవదీప్



ప్రణీత్

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని నాగ్సాన్‌పల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి చెల్మేటి ఎలేందర్ నేషనల్ మీన్స్ స్కాలర్ షిప్‌కు ఎంపికయ్యాడు. 8వ తరగతి చదువుతున్న ఇతను ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో ప్రతిభ కనబర్చాడు. ఏడాదికి రూ.12 వేల స్కాలర్ షిప్ అందుతుందని హెచ్‌ఎం రాంకిషన్ తెలిపారు.

శేరిపల్లి విద్యార్థుల ఎంపిక

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎన్‌ఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. శేరిపల్లి జెడ్పీపాఠశాలలో 8వ తరగతి చదువుతున్న చెప్యాల శ్రీనిత్య ఎన్‌ఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు జెడ్పీపాఠశాల హెచ్‌ఎం తిరుపతి తెలిపారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థి శ్రీనిత్య, గణిత ఉపాధ్యాయుడు జగన్నాథంను హెచఎం అభినందించారు.

మోడల్‌స్కూల్‌లో ఇద్దరు...

చిన్నశంకరంపేట మోడల్‌స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న శేరిపల్లి గ్రామానికి చెందిన చెప్యాల నవదీప్, అంబాజీపేటకు చెందిన డి.ప్రణీత్ ఎన్‌ఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు.

పనులు ప్రారంభించకపోతే ఆందోళన చేస్తాం

హెచ్చరించిన నస్కల్ గ్రామస్తులు



మాట్లాడుతున్న నస్కల్ గ్రామస్తులు

నిజాంపేట(మెదక్): త్వరలో నస్కల్, నందగోకుల్, రాంపూర్, చల్మెడ గ్రామాలకు తారు పనులు త్వరగా ప్రారంభించకపోతే మళ్లీ ఆందోళన ప్రారంభిస్తామని మండలంలోని నస్కల్ గ్రామస్తులు అన్నారు. ఆదివారం వారు మట్లాడుతూ.. 15 రోజుల్లో పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు తమతో దీక్షలు విరమింపజేశారన్నారు. తాము దీక్షలు విరమించి 15 రోజులు గడుస్తున్నా.. పనులు ప్రారంభం కాలేదని నాయకులను ప్రశ్నించగా, సరైన సమాధానాలు చెప్పడంలేదని ఆరోపించారు. రెండు, మూడు రోజుల్లో బీటీ పనులు ప్రారంభించకపోతే అధికార పార్టీ నాయకుల ఇళ్ల ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

ఆరుబయట చెత్త పారబోత

- రోడ్డు పక్కనే డంపు
- అధికారుల పర్యవేక్షణ లోపం
- రోగాలు ప్రబలే అవకాశం



జక్కన్నపేట చెరువు కట్టపక్కన పారబోసిన చెత్త

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని జక్కన్నపేటలో పంచాయతీ సిబ్బంది చెత్త సేకరించి, ఇష్టారీతిగా పారబోస్తుండడంతో ముక్కు మూసుకొని వెళ్తున్నామని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జక్కన్నపేట-పోచమ్మరాళ్ వెళ్లే చెరువు కట్టపక్కనే చెత్తను పారబోస్తున్నారు. దీంతో అక్కడి నుంచి వెళ్లే వారికి దుర్వాసన వస్తుందని, అలాగే చెత్తచెదారం అంతా కాల్వలో పడి పొలాల్లోకి వెళ్లే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. చెత్తను డంపు యార్డుకు తరలించకుండా నిర్లక్ష్యంగా ఎక్కడబడితే అక్కడ పారబోస్తే అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

వెలగని నేషనల్ హైవే లైట్లు



అల్లాదుర్గం(మెదక్): నేషనల్ హైవే మెంటెనెన్స్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. హైవే రహదారి గ్రామాల వద్ద బస్టాండ్‌లను నిర్మించలేదు. ప్రయాణికులు రోడ్డుపైనే నిలబడాల్సిన పరిస్థితి. ప్రయాణికుల సౌకర్యం కోసం లైట్లు ఏర్పాటు చేసినా.. అల్లాదుర్గం, ముస్లాపూర్ గ్రామాల వద్ద చీకటి పడినా లైట్లు వెలగడం లేదు. దీంతో ప్రయాణికులు చీకటిలోనే బిక్కుబిక్కు మంటున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

మంచిని అలవర్చుకోవాలి

- తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతిస్వామి
- వాడి సిద్దేశ్వరాలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న మాధవానంద సరస్వతిస్వామి

హవేళిఘణాపూర్(మెదక్): మనిషి చేసే ప్రతీ మంచి పనిలో దేవుడుంటాడని, అందుకోసం అందరూ మంచి పనులు చేయడం అలవర్చుకోవాలని తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతిస్వామి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని వాడి సిద్దేశ్వరాలయం వార్షికోత్సవంలో పాల్గొన్న ఆయన దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తుల నుద్దేశించి మాట్లాడారు. ప్రతీ ఒక్కరు సమాజంలో ఉన్న ప్రతీ వ్యక్తిపై గౌరవంతో మంచి చేయడం అలవర్చుకుంటే, అన్నింటా మంచే జరుగుతుందన్నారు. మంచి చేసే ప్రతీ మనిషిలో దేవుడుంటాడన్నారు. మహాశివరాత్రి ముందు జరిగే ఈ ఆలయ వార్షికోత్సవాలు అందరిలో భక్తిని పెంపొందిస్తాయన్నారు.

ప్రత్యేక పూజలు

హవేళిఘణాపూర్ మండల పరిధిలోని వాడి గ్రామ శివారులో సిద్దేశ్వరాలయ వార్షికోత్సవంలో మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు శాలువాలు కప్పి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు మాణిక్యరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భిక్షపతిరెడ్డి, నారాగౌడ్, తదితరులు ఉన్నారు.

మాజీ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే



కేటీఆర్‌తో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆదివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే సునీతారెడ్డి కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో తాజా పరిస్థితులపై కేటీఆర్‌తో చర్చించినట్లు ఆమె వివరించారు. పార్టీ నాయకుడు సంతోష్‌రెడ్డి ఉన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

నర్సాపూర్: అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి ఆదివారం ఎల్‌ఓసీ పత్రాన్ని అందజేశారు. కొల్చారం మండలం రాంపూర్‌కు చెందిన గోవింద్‌రావుకు వైద్యం నిమిత్తం సీఎంఆర్‌ఎఫ్ నుంచి మంజూరైన రూ.రెండున్నర లక్షల ఎల్‌ఓసీ లేఖను అందజేశారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు మల్లేశ్‌గౌడ్, హకీం, హర్షవర్ధన్ ఉన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని జంగరాయి గ్రామానికి చెందిన సాలవ్వకు రూ.75 వేల ఎల్‌ఓసీ పత్రాన్ని కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, విద్యాసాగర్‌రెడ్డి ఆమెకు అందించారు. అలాగే నార్సింగి మండలం జప్తిశివనూర్‌లో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు చాంద్‌పాషా అందించారు.

మహిళల ఆర్థిక అభివృద్ధే లక్ష్యం



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హిమజ

శివ్వంపేట(నర్సాపూర్): మహిళలకు చేయూతనిస్తూ వారు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు హోప్ ఫర్ లైఫ్ ఫౌండేషన్ కృషి చేస్తుందని సంస్థ ఫౌండర్ డాక్టర్ హిమజ అన్నారు. మండల పరిధిలోని ముగ్దుంపూర్ బేతని సంరక్షణ నిలయంలో ఆదివారం హెచ్‌ఐవీ బాధితులకు ఉచిత టైలరింగ్, జూట్ బ్యాగ్ మేకింగ్‌పై ఆదివారం శిక్షణ తరగతులను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఫౌండేషన్ ఏర్పాటు చేసి 9 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బేతని సంరక్షణ నిలయంలో పలు కార్యాక్రమాలు నిర్వహించేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. హెచ్‌ఐవీ బాధితులకు అండగా ఉండాలనే ఉద్దేశంతో వారికి జీవితంపై ఆసక్తి పెంపొందించడంతో పాటు స్వయం ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కుట్టు మిషన్ శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం వారికి ఉచితంగా కుట్టుమిషన్లు అందించి వారు కుట్టిన డ్రెస్సుకి మార్కెట్ సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ రాబిన్, సిబ్బంది కర్మెట్, వీరబాబు, విన్సెంట్, మల్లీశ్వరి, వీరేష్ తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో భక్తుల పూజలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి నల్లపోచమ్మ ఆలయంలో భక్తులు పూజలు చేశారు. ఆదివారం ఆలయ అర్చకులు శివ్వప్ప, రాజేశ్, విఘ్నేష్ అమ్మవారికి అభిషేకం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు బోనాలు సమర్పించి, ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు.

భక్తిభావంతో ఉండాలి

శివ్వంపేట(నర్సాపూర్): సమాజంలో ప్రతి ఒక్కరు భక్తిభావంతో ఉండాలని మాజీ ఎంపీపీ హరికృష్ణ అన్నారు. మండలంలోని ఎదుల్లాపూర్‌లో ఎల్లమ్మ, మల్లన్న ఉత్సవాల సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు వెంకటేష్, సునంద రెడ్డి, నిర్వాహకులు సుదర్శన్‌రెడ్డి, యాదిరెడ్డి, అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

చాముండేశ్వరి ఆలయంలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆలయ అర్చకులు తెలిపారు. మండలంలోని చిట్కుల్ శివారులో మంజీరా తీరాన వెలసిన చాముండేశ్వరి అమ్మవారికి కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థ, ప్రసాదాలు వితరణ చేశారు.



మనోహరాబాద్(తూప్రాన్): కాళ్లకల్‌లో బంగారమ్మకు బోనాలు చేస్తున్న భక్తులు



కౌడిపల్లి తునికి నల్లపోచమ్మ ఆలయంలో ..

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ బంగారమ్మను భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. అర్చకులు వేణుగోపాల్‌శర్మ బంగారమ్మకు ప్రత్యేక పూజలు చేసి, భక్తులు తీర్థప్రసాదాలు అందజేశారు. పలు గ్రామాల భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం పోసి, బోనాలు తీసి మొక్కులు చెల్లించుకున్నారు.

స్ఫూర్తిదాయక జీవితం కొనసాగిద్దాం



రేగోడ్(మెదక్): గురువులతో విద్యార్థులు

రేగోడ్(మెదక్): స్ఫూర్తిదాయక జీవితం కొనసాగిద్దామని పూర్వ విద్యార్థులు అన్నారు. మండల కేంద్రమైన రేగోడ్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం 2001–02 బ్యాచ్ పూర్వ విద్యార్థులు సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. సరస్వతీమాత విగ్రహానికి భక్తిశ్రద్ధలతో పూజించారు. అనంతరం పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. ఇరవై మూడేళ్ల తర్వాత ఆయా ప్రాంతాల్లో స్థిరపడిన యాభై మంది విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాందేవ్, రాజేశ్వర్, నాగేశ్వర్‌రావు, నరేందర్, బేతయ్య, విట్టల్ రావు, చంద్ర శేఖర్, పీఆర్టీయూ మండలాధ్యక్షుడు అంజిబాబు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రం కౌడిపల్లి ఉన్నత పాఠశాలలో 1987–88 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి ఉపాధ్యాయులు రాములు, ఖాజాయూసుఫ్‌అలీ, పుండరీకంగౌడ్‌లను విద్యార్థులు సన్మానించారు. 36 ఏళ్ల తర్వాత కలిసిన మిత్రులు ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.

తూప్రాన్: పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–01 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. మండలంలోని ఘనపూర్‌లో అప్పటి గురువులు చౌదరి, రామకిష్టాయ్య, రాజయ్య, రామకిషన్‌రావు, వీర్‌కుమార్, శ్రీనివాస్, లక్ష్మణ్, రాములు, అటెండర్ నర్సింలను ఘనంగా సన్మానించారు.



ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థులు



తూప్రాన్: ఘనపూర్‌లో

ప్రగతి ధర్మారంలో

రామాయంపేట(మెదక్): మండలంలోని ప్రగతి ధర్మారంలో 2010– 11 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.జరిగింది. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు.



రామాయంపేట(మెదక్): ప్రగతి ధర్మారంలో..